క్లుప్తంగా

బ్రాహ్మణవీధిలో అన్నదానం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): బ్రాహ్మణవీధి లోని శ్రీ కాశీ అన్నపూర్ణ దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న దసరా మహోత్సవాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ నిర్వాహకుడు దాసిన కల్యాణ్ కార్యక్రమాన్ని పర్యవేక్షించగా, నాయకులు కొనకళ్ల విద్యాధర రావు, పోతిన బేసుకంటేశ్వరరావు, తాతపూడి చంద్రశేఖర్, బంక దుర్గారావు, బైపిళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ నవరాత్రి మహోత్సవాలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధర పురం రామమందిరం సెంటర్‌కు చెందిన శ్రీకౌసల్య సీతారామ మహిళా సమాజం ఆధ్వర్యంలో మద్ది సువర్చల భక్త బృందం స్థానిక గుప్తా సెంటర్‌లోని శ్రీకన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో గత 9 రోజులుగా శ్రీబతుకమ్మ నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం 40మంది మహిళలు బతుకమ్మ, దుర్గమ్మలకు నైవేద్యాలు సమర్పించి నవదుర్గల పూజలు చేశారు. సాయంత్రం శివయ్య, బతుకమ్మల కల్యాణం జరిగింది. నిర్వాహకురాలు మద్ది సువర్చల మాట్లాడుతూ ఉత్సవాల్లో చివరి రోజైన ఈ నెల 4వ తేదీ సాయంత్రం భక్తి గీతాలు, కోలాట ప్రదర్శనతో శ్రీబతుకమ్మ అమ్మవారి నిమజ్జన కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.

జిల్లా సరోగసి బోర్డు సమావేశం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లా సరోగసి బోర్డు సమావేశం బుధవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఐదుగురు దంపతులు అద్దెగర్భం కోసం దరఖాస్తు చేసుకోగా వాటిని బోర్డు సభ్యులు పరిశీలించారు. వారికి ఉన్న అర్హతలు తదితర అంశాలను తనిఖీ చేశారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని, పిడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ పి.అనిల్ కుమార్, గైనకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అనురాధ పాల్గొన్నారు.

దసరా ప్రత్యేకం.. పీఎస్‌లో ఉత్సవం

- వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు విచ్చేయనున్న దుర్గమ్మ
- నేటి రాత్రి పారువేటోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ దసరా మహోత్సవాలలో వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న ఇంద్రకీలాద్రిపై కొలువైయున్న శ్రీదుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం నిర్వహించే దసరా ఉత్సవాల్లో చివరిరోజైన విజయదశమినాడు పోలీసులు దుర్గమ్మను పూజించడం అనాదిగా వస్తోన్న ఆచారం. తెల్లదొరల పాలనలో అప్పటి పోలీస్ తానేదార్‌గా వ్యవహరించే అధికారి ఈ పూజలను జరిపేవారు. అప్పటి నుంచి ఆనవాయితీగా వస్తూ ప్రస్తుతం స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా వ్యవహరించే అధికారి ఈ ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజాదికాలను జరుపుతారు. ఏటా జరిగే దసరా నవరాత్రుల్లో చివరి రోజున అమ్మవారి తెప్పోత్సవం మొదలుకొని శమీపూజ వరకూ పోలీసులే ప్రధాన పాత్ర వహిస్తారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రంగురంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు.



విద్యుత్ దీపాలంకరణతో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ భవనం

పారువేటోత్సవం..

విజయదశమి నాడు అమ్మవారి తెప్పోత్సవం ముగిసిన తర్వాత ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగింపుగా వన్‌టౌన్ పోలీసు సిబ్బంది అమ్మవారి పాత మెట్ల వద్దకు తీసుకొస్తారు. అక్కడ ప్రత్యేకంగా అలంకరించిన సింహవాహనంపై అమ్మను ఆసీనురాలిని చేస్తారు. అనంతరం పారువేటోత్సవం నిర్వహిస్తారు. ఈ ఉత్సవంలో భాగంగా అమ్మవారు సింహ వాహనంపై ఊరేగుతూ శమీపూజ జరిగే జమ్మిదొడ్డి ప్రాంతానికి చేరుతారు. ఈ జమ్మిదొడ్డి బ్రాహ్మణవీధిలో మల్లికార్జునస్వామి మెట్ల మార్గం సమీపంలో ఉంది.

శమీపూజ–జమ్మికొట్టడం

అమ్మవారిని జమ్మిదొడ్డిలోని ప్రత్యేకంగా అలంకరించిన దర్బారులో కొలువు దీరుతారు. తమకు అన్ని విధాలుగా విజయాలను చేకూర్చాలని పోలీసులు దుర్గమ్మను భక్తితో ప్రార్థిస్తారు. ఇక్కడున్న శమీ వృక్షం(జమ్మి) చెట్టును పూజించడం కూడా ఆచారంగా వస్తోంది. మొత్తం పోలీసు అధికారులందరూ కుటుంబ సభ్యులతో కార్యక్రమంలో పాల్గొంటారు.

వన్‌టౌన్ పీఎస్‌కు అమ్మవారు..

పోలీసులు జమ్మికొట్టిన తర్వాత అమ్మవారి ఉత్సవమూర్తులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువస్తారు. మేళతాళాలతో తమ పోలీసుస్టేషన్‌కు అమ్మవారిని వన్‌టౌన్ పోలీసు సిబ్బంది ఘనంగా ఆహ్వానం పలుకుతారు. అక్కడ అమ్మవారికి వన్‌టౌన్ పోలీసులతో పాటుగా పోలీసు అధికారులు ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తారు. వేకువజాము వరకూ పూజలను చేసి ఇంద్రకీలాద్రికి చేరుస్తారు. ఈ కార్యక్రమంతో దుర్గమ్మ దసరా మహోత్సవాలు ముగిసినట్లుగా భావిస్తారు.

వన్‌టౌన్ పీఎస్‌లో ఆయుధపూజ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలో శాంతి భద్రతలను పరిరక్షించాలని ఇంద్రకీలాద్రిపై కొలువైయున్న కనకదుర్గమ్మను వేడుకుంటూ వన్‌టౌన్ పోలీసులు బుధవారం ఆయుధ పూజ చేశారు. దసరా మహోత్సవాల్లో భాగంగా నవమి రోజు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై అమ్మవారి చిత్రపటాలను ఉంచి శాస్త్రోక్తంగా పూజాదికాలను నిర్వహించారు. బ్రిటిష్ కాలం నుంచి అప్పటి తానేదార్‌గా వ్యవహరించే పోలీసులు దసరా శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి పూజలు చేయడం ఆనవాయితీ. ఈ క్రమంలో ప్రస్తుత స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఉన్న సీఐ జి. గురుప్రకాష్ దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారి ముందు ఆయుధాలను ఉంచి పూజాదికాలను నిర్వహించారు. తలచినంతనే సమస్త భయాలను తొలగించి ధైర్యాన్ని, స్థైర్యాన్ని మహిషాసురమర్దినీదేవి ప్రసాదిస్తుందని నమ్మకం. ఈ కారణంగానే దసరా మహోత్సవాల్లో తొమ్మిదో రోజైన అశ్వయుజ శుద్ధ నవమి నాడు ఆయుధ పూజ చేస్తారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న పోలీస్ క్వార్టర్స్‌లో నివాసముంటున్న సిబ్బంది, కుటుంబసభ్యులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారి నైవేద్యాలను ప్రసాదంగా స్వీకరించారు.



కుటుంబ సభ్యులతో ఆయుధ పూజలో పాల్గొన్న సీఐ గురుప్రకాష్

విశ్వ వినోదిని.. విష్ణు విలాసిని



మహిషాసురమర్దినీదేవిగా భ్రమరాంబ అమ్మవారు



వైష్ణవిదేవిగా పద్మావతి అమ్మవారు



మహిషాసురమర్దినీదేవిగా మహాలక్ష్మి అమ్మవారు

మహిషాసురమర్దినికి భక్తుల విశేష పూజలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని వివిధ ఆలయాల్లో కొలువై ఉన్న ఆలయాల్లో అమ్మవారు బుధవారం మహిషాసురమర్దినీదేవిగా, శ్రీవైష్ణవీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల్లో పలు కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

- శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో కొలువై ఉన్న భ్రమరాంబ అమ్మవారు మహార్నవమిని పురస్కరించుకొని శ్రీ మహిషాసురమర్దినీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కుంకుమార్చనలు, చండీహోమం, ఖడ్గమాలార్చనలు నిర్వహించారు.
- బ్రాహ్మణవీధిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో కొలువై ఉన్న పద్మావతి అమ్మవారు శ్రీ వైష్ణవీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ కుంకుమార్చనలను వైభవంగా నిర్వహించారు.
- కొత్తపేటలో కొలువై ఉన్న శ్రీ చదును మహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు శ్రీ మహిషాసురమర్దినీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉపాలయమైన శ్రీ అష్టలక్ష్ముల ఆలయంలో అమ్మవారు శ్రీ అష్టలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.
- కేటీరోడ్డులో కొలువై ఉన్న శ్రీ గంగానమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు శ్రీ మహిషాసురమర్దినీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.
- పాతబస్తీలోని శ్రీ వసంత మల్లికార్జునస్వామి వారి దేవస్థానం (బుద్దావారి గుడి)లో అమ్మవారు శ్రీ మహిషాసురమర్దినీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): స్థానిక భీమన వారి పేటలోని శ్రీవిజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దినీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

- పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీ గంగానమ్మవారి దేవస్థానంలో అమ్మవారు శ్రీమహిషాసురమర్దినీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమార్చనలు, హోమాన్ని నిర్వహించగా, పలువురు భక్తులు, ఉభయదాతలు పాల్గొన్నారు.
- చిట్టినగర్‌లోని శ్రీమహాలక్ష్మీ అమ్మవారి సన్నిధిలో జరుగుతున్న ఉత్సవాలలో భాగంగా 10వ రోజు అమ్మవారు శ్రీమహిషాసురమర్దినీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలోని సాంస్కృతిక కళావేదికపై పలువురు చిన్నారులు నృత్య ప్రదర్శన ఇవ్వగా అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి.



ముత్తైదువులకు పసుపు-కుంకుమ అందజేస్తున్న సాయి సేవకులు



కొత్త అమ్మవారి సన్నిధిలో ప్రదర్శన చేస్తున్న చిన్నారులు



భవానీపురం కోళ్ల ఫారం రోడ్‌లో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక కోళ్లఫారం రోడ్‌లో అమ్మవారు శ్రీమహిషాసురమర్దిని దేవిగా దర్శనమిచ్చారు.

- చిట్టినగర్ 47వ డివిజన్ పరిధిలోని కుండల మార్కెట్‌లోగల శ్రీ గంగా – దుర్గా – మారెమ్మ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారు శ్రీమహిషాసురమర్దినిగా పూజలు అందుకున్నారు.
- భవానీపురం ఊర్మిళా సుబ్బారావు నగర్ గ్రామ దేవత పోలేరమ్మ దేవస్థానంలో పోలేరమ్మ శ్రీమహిషాసురమర్దినిగా దర్శనం ఇచ్చారు.
- విద్యాధరపురం రోటరీనగర్‌లోని శ్రీకనకదుర్గమ్మ దేవాలయంలో అమ్మవారు మహిషాసురమర్దిని దేవిగా భక్తుల పూజలు అందుకున్నారు.
- స్థానిక హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోని సంకల్ప సిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో అమ్మవారిని శ్రీమహిషాసురమర్దిని దేవిగా అలంకరించారు. ముత్తైదువులకు పసుపు-కుంకుమ, తాంబూలం, పండ్లు, ప్రసాదాలు అందజేశారు.

‘వీఐపీ’లకే పెద్ద పీట!

క్యూలైన్‌లో కాకుండా నేరుగా ఆలయంలోకి వస్తున్న వైనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఈ ఏడాది దసరా ఉత్సవాలలో కొండపైకి చేరిన పది నిమిషాలలోనే వీఐపీలు, సిఫార్సులతో అమ్మవారి దర్శనం చేసుకునే వారి సంఖ్య దాదాపు రెట్టింపు అయ్యింది.

వీఐపీ టైం స్లాట్ సమయంలో ఈ సమస్య మరింత ఎక్కువైంది. ముఖ్యంగా మూలా నక్షత్రం తర్వాత నుంచి సాయంత్రం 3 గంటల నుంచి 4 గంటల మధ్య వీఐపీ టైం స్లాట్‌లో వీఐపీ దర్శనం కోసం వచ్చే వారి సంఖ్య రెట్టింపయింది. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రముఖుల సిఫార్సులతో వీఐపీ టికెట్లు పొందుతున్న వారు వారికి కేటాయించిన ప్రత్యేక వీఐపీ క్యూలైన్‌లో కాకుండా నేరుగా ఆలయంలోకి ప్రవేశించేందుకు పోటీ పడుతున్నారు. బుధవారం మధ్యాహ్నం మూడున్నర గంటల సమయంలో ఆలయంలోకి చేరుకునే కీలకమైన నాలుగు మార్గాల్లోనూ వీఐపీ భక్తులు బారులు తీరి కనిపించారు. కనీసం ఆలయంలోకి వెళ్లే అర్చకులు, అధికారులను సైతం ముందుకు కదలనీయకుండా అడ్డుగా నిల్చుండిపోయారు. ఉత్సవాలలో సామాన్య భక్తులకు పెద్ద పీట వేస్తున్నామని చెబుతున్న అధికారులు ఈ వీఐపీ దర్శనాలకు ఏం సమాధానం చెబుతారో!



గాలిగోపురం పక్కన అత్యవసర ద్వారం ఎదుట క్యూ కట్టిన భక్తులు

నేత్రపర్వంగా సాంస్కృతిక ప్రదర్శనలు

విజయవాడ కల్చరల్: దేవదాయ ధర్మదాయశాఖ, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రులు సందర్భంగా కనకదుర్గానగర్‌లోని కళావేదికపై ప్రదర్శిస్తున్న నృత్యాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. ఎ. సంతోష్ బృందం భరతనాట్య సంప్రదాయంలో వాగ్గేయకార కీర్తనలకు నృత్యాలను అభినయించారు. అలాగే నల్లపాడు, గుంటూరుకు చెందిన కళాకారులు కూచిపూడి సంప్రదాయంలోని పలు కీర్తనలకు నాట్యం చేశారు. అలాగే భక్తి సంగీతంలో భాగంగా జి. సందీప్, ఉదయశ్రీగీత, పీవీపీ ప్రసాద్, కె. చంద్రికలు భక్తి గీతాలను ఆలపించారు. చిన్నారులకు నిర్వాహకులు జ్ఞాపికలను అందజేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ



భవానీపురం(విజయవాడ పశ్చిమ): దసరా పండుగను పురస్కరించుకుని పారిశుద్ధ్య కార్మికులు, పేద మహిళలకు ప్రముఖ చిత్రకారుడు, గిరిజన గీత శిల్పి డాక్టర్ బొండా జగన్‌మోహన్‌రావు భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీ లోగల తన నివాసం (బొండా ఆర్ట్ గ్యాలరీ)లో బుధవారం చీరలు, టవల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయ మాట్లాడుతూ ఏటా మాదిరిగానే ఈ ఏడాదికూడా వంద మంది మహిళలకు అందించినట్లు తెలిపారు.

కీర్తి పురస్కార గ్రహీత శోభనాద్రికి సత్కారం



భవానీపురం(విజయవాడ పశ్చిమ): వ్యక్తిత్వ వికాస రంగంలో విశేష కృషి కృషి చేసిన విజయవాడకు చెందిన తిరుక్కోళ్లూరి శోభనాద్రికి గాడిచర్ల హరిసర్వోత్తమరావు–బీవీ దాశరథి కీర్తి పురస్కారాన్ని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఇటీవల హైదరాబాద్‌లో ప్రదానం చేసింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఏపీ పీటీడీ బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, చిన్నయసూరి సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి ఎస్పీ శేషగిరిరావు బుధవారం రామవరప్పాడులోని ఆయన నివాసంలో అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ శోభనాద్రి 92ఏళ్ల వయసులో కీర్తి పురస్కారాన్ని అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటికీ సామాజిక, సాంఘిక, సాంస్కృతిక, సాహితీ రంగాలలో సేవలు అందించడం ఆయనలోని తపనకు నిదర్శనమని కొనియాడారు. సాహితీ పీఠం సభ్యులు పి. వెంకటేశ్వరరావు, పావని విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

బలవంతంగా జిమ్ సామగ్రి తొలగింపు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సీఎం పర్యటన పేరుతో గాంధీకొండపై 49 ఏళ్లగా నడుపుతున్న జిమ్‌ను తొలగించడం సరికాదని కోచ్ కంది అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీకొండపై ఓ పక్కగా ఉన్న జిమ్‌ను తొలగించమని గాంధీహిల్ ఫౌండేషన్ బలవంతం చేయడంతో, దీనిపై సీఎం చంద్రబాబుకి, కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. అయితే బుధవారం మధ్యాహ్నం ఫౌండేషన్ వారు బలవంతంగా జిమ్ గది తాళాలు పగలగొట్టి పరికరాలతో పాటు సామాన్లను ట్రాక్టర్‌లో మరో చోటుకు తరలించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తనకు తగిన న్యాయం చేయమని పోలీసులను కోరుతున్నానని, ఈ వ్యవహారంపై న్యాయపోరాటానికైనా సిద్ధమేనని అప్పారావు పేర్కొన్నారు.

పట్టువస్త్రాలు సమర్పించిన సేవాబృందం

సగానికి పైగా కమిటీ సభ్యులు డుమ్మా

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాలలో భక్తుల సేవ కోసం ప్రభుత్వం నియమించిన 96 మంది సభ్యుల జంబో కమిటీ బుధవారం అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించింది. అయితే దాదాపు సగానికి పైగా కమిటీ సభ్యులు హాజరుకాకపోవడం విమర్శలకు తావిచ్చింది. ఉత్సవాలు ముగింపు దశకు చేరుకోవడంతో అందరి భాగస్వామ్యంతో అమ్మవారికి పట్టుచీర, పూలు, పండ్లు, పూజ సామగ్రికి ఇవ్వాలని సభ్యులు నిర్ణయించారు. ఈ మేరకు అందరూ కొంత మొత్తం వేసుకోవాలని నిర్ణయించుకుని మిగిలిన సభ్యులకు సమాచారం ఇచ్చారు. అయితే 96 మంది సభ్యులలో సగానికి పైగా సభ్యులు కార్యక్రమానికి మొగ్గు చూపలేదు. దీంతో సుమారు 50మంది సభ్యులు అంగీకరించడంతో వారందరూ అమ్మవారికి సమర్పించేందుకు అవసరమైన పూజా సామగ్రితో ఆలయానికి చేరుకున్నారు. కార్యక్రమానికి అందరు సభ్యులు హాజరవుతారని కమిటీ భావించింది. అయితే ఉదయం 11గంటల వరకు అరకొరగానే సభ్యులు తమ కుటుంబ సభ్యులతో హాజరు కావడంతో కొండపైకి వచ్చిన సభ్యులు, కుటుంబీకులతో కలిసి వెళ్లి అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. దసరా ఉత్సవాలలో భక్తుల సేవ కోసం నియమించిన కమిటీపై దాదాపు సగం మందికి పైగా అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇంత పెద్ద మొత్తంలో సభ్యులను నియమించడం, తొలి నాళ్ల నుంచి గందరగోళ పరిస్థితులు నెలకొనడంతో అనేక మంది తమ కుటుంబానికి అమ్మవారి దర్శనం చేయించడం ఆ తర్వాత కొండ దిగిపోవడం కనిపించింది.

శాస్త్రోక్తంగా ఆయుధ పూజ



సత్యనారాయణపురం(విజయవాడపశ్చిమ): దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో బుధవారం ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్‌లో శాస్త్రోక్తంగా ఆయుధ పూజ నిర్వహించారు. నార్త్‌జోన్ ఏసీపీ డాక్టర్ స్రవంతి రాయ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వి.వి లక్ష్మీనారాయణ దంపతులు అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సిబ్బంది ఆయుధాలను అమ్మవారి ఎదుట ఉంచి పూజాదికాలను నిర్వహించారు. ఎస్ఐలు షబ్బీర్, సౌజన్య, సిబ్బంది కుటుంబ సభ్యులతో కలసి పూజ కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఆశీర్వాచనాలు అందుకున్నారు.